క్లుప్తంగా

మే 10న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: స్థానిక కోర్టు ఆవరణలో మే 10వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ తెలిపారు. ఇదే విషయమై ఆమె.. స్థానిక పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, బ్యాంకు అధికారులు, పోలీసులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులన్నీ పరిష్కరిస్తామని, న్యాయవాదులు, పోలీసులంతా సహకరించి వీలైనన్ని కేసులను పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆమె తెలిపారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజులు వాపసు ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.నైమిష, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్‌ఈసీహెచ్ జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీవో సత్యవతి

వంగర: తప్పుడు మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీవో మర్రాపు సత్యవతి హెచ్చరించారు. మండలంలోని గీతనాపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. మస్తర్లు తనిఖీ చేసి, పనిలోకి వచ్చిన వారికి మాత్రమే మస్తరు వేయాలని, పనిలోకి రాని వారికి మస్తరు వేయవద్దన్నారు. పనుల వద్ద తాగునీరు, ప్రథమ చికిత్స కిట్, టెంట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

తాగునీటి పైపులైన్లకు లీకులు లేకుండా చూడాలి

బొబ్బిలి: తాగునీటి పైపులైన్లకు లీకులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బేబీనాయన ఆదేశించారు. మండలంలోని భోగరాజపురం వద్ద ఉన్న హెడ్ వాటర్ వర్క్స్‌ను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. తాగునీటి సరఫరా అవుతున్న ఇన్‌ఫిల్టరేషన్ బావుల వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలన్నారు. అదనపు ఇన్‌ఫిల్టరేషన్ బావిని తవ్వించేందుకు అవసరమైన నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అన్నదానం

సంతకవిటి: మండలంలోని జావాం గ్రామంలో అన్నదాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పగడాలమ్మ జాతర మహోత్సవం సందర్భంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో జాతరకు వచ్చే భక్తులకు జాతర జరిగే మూడు రోజులూ అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


శ్మశానవాటిక అభివృద్ధి పనులు



జగన్నాథపురంలో జరుగుతున్న శ్మశాన వాటిక అభివృద్ధి పనులు

బొబ్బిలిరూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో శ్మశానవాటిక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులను ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు శుక్రవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొద్దల పద్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న జనార్థనరావు

రేగిడి: ఐక్యతతోనే సమస్యల పరిష్కారమని, రైతులంతా ఐకమత్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నారు జనార్థనరావు కోరారు. మండలంలోని సంకిలి గ్రామంలో రైతు సంఘం వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. రైతు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులంతా భూమి కోసం, సాగు కోసం నిత్యం పోరాటం చేయాలన్నారు.

- బీసీ రుణాల్లో అర్హులకు మొండిచేయి
- అర్హత ఉన్నా..లేకున్నా.. కూటమి నేతలకే రుణాలు
- అధికారులను బెదిరించి మరీ మంజూరు
- ఆందోళనలో ఆశావహులు

పచ్చ నేతలకే.. బీసీ రుణాలు!



ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు చేస్తున్న అధికారులు(ఫైల్)

రామభద్రపురం:

బాబు వస్తే.. జాబు వస్తుందని.. అది రాకుంటే.. నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికలప్పుడు జనాలను కూటమి నాయకులు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఉద్యోగాలు ఇవ్వకపోగా కనీసం నిరుద్యోగ భృతి కూడా ఇవ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇటీవల బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు.. రుణం మంజూరైతే ఏ దుకాణమో.. వ్యాపారమో పెట్టుకుని జీవనోపాధి పొందుదామనుకున్నారు. ఎంతో ఆశతో దరఖాస్తు చేసుకుని, ఇటీవల ఇంటర్వ్యూలకు కూడా హాజరయ్యారు. అయితే ఈ రుణాల మంజూరులో పచ్చ(టీడీపీ) నేతల జోక్యం ఉందని, వారు చెప్పిన వారికే రుణాలు కట్టబెడుతున్నారన్న ప్రచారం జోరుగా జరుగుతుండడంతో అర్హులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక తమకు రానట్లేనని.. ఓటేసిన పాపానికి అనుభవించాల్సిందేనని తమను తాము నిందించుకుంటూ వాపోతున్నారు.

మండలాల వారీగా కేటాయింపులు ఇలా..

మండలం	దరఖాస్తు దారులు	యూనిట్లు	మంజూరైన నిధులు
బొబ్బిలి	400	102	రూ.1.97 కోట్లు
రామభద్రపురం	450	81	రూ.1.48 కోట్లు
బాడంగి	365	78	రూ.1.42 కోట్లు
తెర్లాం	660	93	రూ.1.70 కోట్లు

నిబంధనలకు పాతర..

నిబంధనలకు అధికారులు పాతరేస్తున్నారు. అధికారంలో ఉన్న నాయకుల మాటే వింటూ అర్హులకు అన్యాయం జరిగేలా వ్యవహరిస్తున్నారు. అర్హతలు పక్కనబెట్టి అనర్హులకు బీసీ రుణాలు కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు. అధికారులంతా అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు అంతటా వ్యక్తమవుతున్నాయి. బీసీ రుణాలు పొందాలంటే అర్హతలేంటని అడిగితే అధికారులు నీళ్లు నమిలే పరిస్థితి ఉంది. నిబంధనల ప్రకారం అధికారులు, బ్యాంకు అధికారులు కలిసి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఇంటర్వ్యూ చేసి, వారి అర్హతలను పరిశీలించి, రుణాలు మంజూరు చేయాలి. కానీ ఇవేమీ ఇప్పుడు జరగడం లేదు. ఎటువంటి అర్హతలు చూడకుండా కూటమి నాయకులు, కార్యకర్తలకే రుణాలు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే అధికార పార్టీ నాయకులు చెప్పిన వారి పేర్లతో అర్హుల జాబితా తయారైందన్న మాట అంతటా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించే గొప్ప నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని, ఆయనను దూరం చేసుకున్నామని అర్హులైన దరఖాస్తుదారులంతా మదనపడుతున్నారు.

354 యూనిట్లకు 1875 మంది..

వెనకబడిన తరగతుల వారికి స్వయం ఉపాధి నిమిత్తం బీసీ కార్పొరేషన్ రుణాలకు ప్రభుత్వం దరఖాస్తులు కోరింది. బొబ్బిలి నియోజకవర్గానికి మొత్తం 354 యూనిట్లు కేటాయించి, రూ.6.57 కోట్లు మంజూరు చేశారు. అయితే నియోజకవర్గంలోని నాలుగు మండలాలు(రామభద్రపురం, బొబ్బిలి, బాడంగి, తెర్లాం) నుంచి మొత్తం 1875 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎవరు దరఖాస్తు చేసుకున్నా.. ఎవరు ఇంటర్వ్యూలకు హాజరైనా తాము సూచించిన వారికే లోన్లు(రుణాలు) ఇవ్వాలని కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. తాము అధికారంలో ఉన్నామని, ఎవరేమనుకుంటే తమకేమని.. తాము చెప్పిన పేర్లు బ్యాంకులకు పంపించాలని హుకుం జారీ చేస్తున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచే జాబితా తయారై వెళ్లిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జాబితా సిద్ధం చేశాం..



నిబంధనల ప్రకారమే కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు నిర్వహించాం. అర్హతే ప్రామాణికంగా రుణాలు మంజూరు జరిగేలా చూస్తాం. అర్హుల జాబితాను బ్యాంకులకు పంపించేందుకు సిద్ధం చేశాం. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం లేదు.

– రత్నం, ఎంపీడీవో, రామభద్రపురం

గౌరవ వేతనం ఇవ్వాలి

బొబ్బిలి: మండల పరిషత్ సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలని మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సర్దార్ కోరారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నెలల తరబడి వేతనం ఇవ్వకుండా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. మండలంలో వివిధ పనుల నిమిత్తం బడ్జెట్ నిధులు విడుదల చేసి, సభ్యుల వేతనాలకు బడ్జెట్ కేటాయించకుండా పెండింగ్‌లో ఉంచడం భావ్యం కాదన్నారు.


రూ.3 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

రాజాం: స్థానిక పట్టణంలోని ఆదర్శనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. రూ.3 లక్షలతో సీసీ కమ్ డ్రెయిన్ నిర్మాణం చేస్తున్నట్లు ఏఈ వెంకట్ తెలిపారు. మున్సిపాలిటీ 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులు చేస్తున్నామన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

బాడంగి: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కె.సుధాకర్ హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని కోరారు. పాల్తేరు నుంచి ఇసుక అధికంగా తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఇప్పటికైనా అక్రమంగా ఇసుక తరలింపు మానుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



శ్రీనివాసుని కల్యాణం చేస్తున్న అర్చకులు

రాజాం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని అంతకాపల్లి గ్రామంలోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు స్వామి వారి కల్యాణం తిలకించేందుకు పోటెత్తారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త గ్రంధి భాస్కరరావు, జీఎంఆర్ సంస్థల సీఈవో లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిన్నతరహా సాగునీటి వనరుల గణన చేపట్టాలి



వీఆర్వోలతో మాట్లాడుతున్న సహాయ గణాంకాధికారిణి రజని

బాడంగి: చిన్నతరహా సాగునీటి వనరుల గణన చేపట్టాలని సహాయ గణాంకాధికారిణి పి.రజిని వీఆర్వోలకు సూచించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో హెచ్‌డీటీ ధనం అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన ఆమె.. ప్రతి ఐదేళ్లకోసారి చిన్న తరహా నీటివనరుల గణన చేయాల్సి ఉంటుందని గుర్తు చేశారు. త్వరితగతిన లెక్కింపులు చేపట్టి, నివేదిక అందజేయాలన్నారు.

తెర్లాం: మండలంలో సాగునీటి వనరుల గణనను సకాలంలో పూర్తి చేయాలని ఏఎస్‌వో నారాయణరావు ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ హేమంత్ కుమార్ ఆదేశాల మేరకు వీఆర్‌వోలకు సాగునీటి గణనపై శిక్షణ శుక్రవారం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ఉన్న సాగునీటి చెరువులు, బోరుబావులు, నేలబావులు ఎన్ని ఉన్నాయన్న విషయాలను నమోదు చేయాలన్నారు. ప్రతి ఐదేళ్లకోసారి సాగునీటి వనరుల గణనను చేయడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది కూడా సాగునీటి వనరుల గణనను చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ సత్యనారాయణ, ఆర్ఐ కృష్ణమూర్తినాయుడు పాల్గొన్నారు.



తెర్లాంలో సాగునీటి వనరుల గణనపై శిక్షణ ఇస్తున్న ఏఎస్‌వో నారాయణరావు

ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి చేయాలి

రేగిడి: ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్యలు సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని పలు సెక్టార్లకు చెందిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల నుంచి ఒకటో తరగతిలో చేరబోయే విద్యార్థుల వివరాలను శుక్రవారం సేకరించారు. అంగన్‌వాడీ విద్య పూర్తి చేసిన చిన్నారులను దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేలా చూడాలన్నారు. అనంతరం ఎంపీడీవో శ్యామలాకుమారిని కలిసి ప్రాథమిక పాఠశాలల తీరుపై ఆరాతీశారు. ఈ కొత్త విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి, ఈ నెల 21వ తేదీ నుంచి మూడు రోజులు పాటు ప్రత్యేక డ్రైవ్ ఉంటుందని, సచివాలయ ఉద్యోగులు ఈ డ్రైవ్‌లో పాల్గొని సహకరించేలా చూడాలని కోరారు.



ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

రాజాం సిటీ: నవధాన్యాల సాగుతో నేల సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి రమాదేవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బొమ్మినాయుడువలస గ్రామంలో నవధాన్యాల సాగుపై శుక్రవారం గ్రామసభ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతులు నవధాన్యాలను ఎకరానికి 12 కేజీలు చొప్పున చల్లుకోవాలని తెలిపారు. పంటకు కావాల్సిన పోషకాలు అంది నేలసారవంతం కావడంతో పాటు ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ శ్రావణి, రమ, కృష్ణమోహన్, రైతులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన

రేగిడి:

ప్రతిఒక్కరూ భోజనం చేసే ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని బూరాడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత సూచించారు. మండలంలోని ఉంగరాడ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం సందర్శించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చేతులు శుభ్రంగా ఉంటే ఎటువంటి వ్యాధులు మన దగ్గరకు చేరవన్నారు.



చేతులు శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుజాత

21న ప్రవేశ పరీక్ష

దత్తిరాజేరు : షికారుగంజి వద్దనున్న మోడల్ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి శుక్రవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆ రోజు మోడల్ పాఠశాలలో ఉదయం పది గంటల నుంచి 12 గంటల వరకు జరగనున్న పరీక్షకు హాజరు కావాలని సూచించారు. హాల్‌టిక్కెట్లను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

13న గురుకులంలో..

చీపురుపల్లి రూరల్: పట్టణంలోని డా. బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి ఈ నెల 13న ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.రాణిశ్రీ తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రానికి గంట ముందు విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

వేలంపాట వాయిదా

సంతకవిటి: కౌలు నిమిత్తం శుక్రవారం జరగాల్సిన మండలంలోని సిరిపురం కొండపై ఉన్న శ్రీకొండకామేశ్వరాలయ భూమి వేలంపాట వాయిదా పడింది. సర్వే నంబరు 84లోని 2.70 ఎకరాల భూమిని వేలం ద్వారా కౌలుకు ఇచ్చి, వచ్చే ఆదాయాన్ని ఆలయాభివృద్ధికి వినియోగించాలని వేలంపాటకు దేవదాయ శాఖ అధికారులు సిద్ధమయ్యారు. అయితే పూజారి అడ్డుపడడంతో పాటు అదే భూమిలోని నిబంధనలు అతిక్రమిస్తూ నాటిన పామాయిల్ మొక్కలు తొలగించిన తర్వాతే వేలం వేయాలని గ్రామస్తులు పట్టుబట్టారు. దీంతో వేలంపాట వాయిదా వేసి, తదుపరి తేదీని త్వరలో చెబుతామని ఆలయ ఈవో బీవీ మాధవరావు, రాజాం నవదుర్గ ఆలయ ఈవో పి.శ్యామలరావులు తెలిపారు. ఇకపై వేలంలో సిరిపురం పంచాయతీకి చెందిన వారు మాత్రమే పాల్గొనాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.



పామాయిల్ మొక్కల తొలగింపు తర్వాతే వేలంపాట వేయాలని అధికారులను చుట్టుముట్టిన గ్రామస్తులు

గొప్ప సంఘసంస్కర్త పూలే



రాజాం: పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ తదితరులు

మానవతావాది, గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని, పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. అంటరానితనం, కులవివక్షపై అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు పూలే అని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, స్త్రీ విద్యకు ఆయన తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.

– రాజాం, వంగర, బాడంగి



వంగర: పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



బాడంగి గురుకుల పాఠశాలలో పూలే జయంతి

సారా నిర్మూలనకు కృషి చేయాలి

మెంటాడ: సారా నిర్మూలనకు కృషి చేయాలని గజపతినగరం ఎక్సైజ్ సీఐ జె.జనార్దనరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో శుక్రవారం సమావేశమైన ఆయన.. గ్రామీణ ప్రాంతాల్లో సారా తయారీ, విక్రయాలు జరగకుండా, అలాగే మద్యం బెల్టుషాపులు నిర్వహించకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతోనే సారా నిర్మూలన సాధ్యమని, అందరూ సహకరించాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తి, ఎస్ఐ కె.సీతారాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సన్యాసినాయుడు

పౌష్టికాహారం తీసుకోవాలి

తెర్లాం: గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెర్లాం–2, 5 అంగన్‌వాడీ కార్యకర్తలు జి.లక్ష్మి, వై.శ్రీదేవి సూచించారు. ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆదేశాల మేరకు పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణుల ఇళ్లకు వారు శుక్రవారం వెళ్లి, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మెరుగైన ఆరోగ్యానికి గర్భిణులు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతినెలా క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని తెలిపారు.



ఇంటింటికీ వెళ్లి, అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సర్పంచ్ మృతి పార్టీకి తీరనిలోటు

మెంటాడ: వైఎస్సార్ సీపీ బలోపేతానికి, గ్రామాభివృద్ధికి బడేవలస గ్రామ సర్పంచ్ మీసాల పార్వతి చేసిన సేవలు వెలకట్టలేనివని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కొనియాడారు. పార్టీ సీనియర్ నాయకుడు మీసాల గురునాయుడు సతీమణి అయిన సర్పంచ్ పార్వతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె పెద్దకర్మ కార్యక్రమం ఆ గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన.. పార్వతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీకి, గ్రామ ప్రగతికి ఆమె పాటుపడిన తీరును ప్రశంసించారు. ఆమె మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామరావు, గజపతినగరం జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు తదితరులు పాల్గొన్నారు.